క్లుప్తంగా

ఘనంగా కందుకూరి జయంతి



కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి దుర్గప్రసాద్, హెచ్ఎం రవిబాబు

బాడంగి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్, పింద్రింగివలస హెచ్ఎం రవిబాబు, తదితరులు కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆ రోజుల్లో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాడిన మహనీయుడని కొనియాడారు. సమ సమాజ స్థాపనకు ఎనలేని పోరాటం చేశారన్నారు.

కోచింగ్ పేరుతో ఫీజుల బాదుడు

బొబ్బిలి: పట్టణంలోని పలు కోచింగ్ సెంటర్లు వివిధ ప్రవేశ పరీక్షలకు శిక్షణ పేరుతో పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణకు వేలాది రూపాయలను వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా రాములోరి సంబరాలు



రాములోరి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: అంబఖండి గ్రామంలో లావేటి కుటుంబీకుల ఇలవేల్పు శ్రీరామదేవుని సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం సంబరాల్లో పాల్గొని రాములవారిని దర్శించుకుని పూజలు చేశారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీలు మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నర్సింగరావు, పుర్లి గోపాలకృష్ణ, సర్పంచ్‌లు రమేష్‌నాయుడు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, లావేటి గణపతిరావు, లావేటి వేణుగోపాలనాయుడు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశమ్మ తల్లి వారాలు

బొబ్బిలి: త్వరలో చేపట్టనున్న పెద్ద పండుగ నేపథ్యంలో ముందస్తుగా మున్సిపాలిటీలోని మల్లంపేటలో దేశమ్మతల్లి వారాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. మహిళలు ఘటాలన ఊరేగించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అగ్నిప్రమాదాల సమయంలో ఆందోళన వద్దు



రాజాం సిటీ: మంటను అదుపుచేసే విధానం మహిళచే చేయిస్తున్న ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో మహిళలు ఆందోళన చెందకుండా అవగాహనతో వ్యవహరించాలని రాజాం ఫైర్ స్టేషన్ ఎస్సై టీఎస్ఎస్ జనార్దనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్‌లలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాస్ లీకైన సమయంలో ఏవిధంగా వ్యవహరించాలో వివరించారు. ఆందోళనతో పరుగులు తీయకుండా వెంటనే బకెట్ కాని, దుప్పటి గాని గ్యాస్‌బండపై కప్పాలని సూచించారు. అలా చేయడం వల్ల మంటలు వ్యాపించకుండా అడ్డుకోవచ్చన్నారు. అనంతరం గ్యాస్ మంటను ఆర్పే విధానాన్ని మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు.

భూసార పరీక్షలపై అవగాహన



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రాజాం: ఆర్‌బీకేల్లో విధులు నిర్వహిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పెనుబాక వద్ద ఆదివారం మట్టినమూనాల సకరణపై రాజాం వ్యవసాయశాఖ ఏడీ కొల్ల చంద్రరావు సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకునేలా చూడాలని సూచించారు. ఏఓ రేణుకాసాయి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పని తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పని తీరు బాగుందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

– సాక్షి నెట్‌వర్క్ బొబ్బిలి, రాజాం



రాజాం: బొద్దాంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ తవిటమ్మ, తదితరులు



రామభద్రపురం: పాందూరు వీధిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, తదితరులు



రేగిడి: వన్నలిలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటిస్తున్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



సంతకవిటి: వాల్తేరులో ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, తదితరులు



రాజాం సిటీ: నందబలగలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఈశ్వరరావు, గృహసారథులు



బొబ్బిలి: 30వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ వనజా మనోజ్‌కుమార్, తదితరులు



బాడంగి: ఆనవరంలో జగనన్నే మా భవిష్యత్ అంటూ ప్రచారం చేస్తున్న ఈదుబిల్లి శ్రీను, చంటి, వలంటీర్లు, తదితరులు



తెర్లాం: ఎం.ఆర్ అగ్రహారంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీసర్వే పూర్తిస్థాయిలో చేపట్టి రైతులకు భూసమస్యలు లేకుండా చూడాలని ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో గోపింపేట, అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస తదితర గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తిచేశారు. ఉప్పర్నాయుడువలసలో రైతుల భూములకు సంబంధించి తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో ఆదివారం వీఆర్‌ఓలు హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు రీసర్వేతో పరిష్కారం లభించినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

యువత ఔదార్యం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు తమ ఔదార్యం చాటుకున్నారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన రెండు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా వీటిని అందజేయడంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాసరావు, గాడెపల్లి గోవిందరావు, బెజ్జిపురపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సరుకులు అందిస్తున్న యువకులు

ఇలా అయితే ఎలా..!



అధిక లోడ్‌తో గాంధీబొమ్మ సెంటర్ మీదుగా రాజాం వైపు వెళుతున్న మినీ వ్యాన్

రామభద్రపురం: మండల కేంద్రం మీదుగా లగేజీ వాహనదారులు అధిక లోడులతో రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా వరి పొట్టు, పాత సామాన్లు, ప్లాస్టిక్ డ్రమ్ములు, బిందెలు, ఖాళీ బ్రాందీ సీసాలు, తినుబండారాల ప్యాకెట్లు వంటి సరుకులతో ప్రయాణాలు సాగిస్తున్నారు. పరిమితికి మించి ప్రమాదకర రీతిలో రాకపోకలు సాగిస్తుండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మలుపుల వద్ద ఓవర్ లోడ్ వల్ల వాహనాలు బోల్తా పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అధిక లోడ్ వేసుకుని బొబ్బిలి వైపు వెళుతున్న టాటా ఏస్ వ్యాన్

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు



నదిలో పిల్లర్ల ఏర్పాటుకు యంత్రాలతో గోతులు తవ్వుతున్న దృశ్యం

సంతకవిటి: మండలంలో వాల్తేరు గ్రామంలోని బలసలరేవు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాణానికి సంబంధించి ప్రారంభ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈనెల 19న వంతెన నిర్మాణ పనులకు సీఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పిల్లర్ల నిర్మాణానికి యంత్రాల సాయంతో నదిలో గోతులు తవ్వుతున్నారు. ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయల్‌నాయక్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



పూడికలు తొలగిస్తున్న కార్మికులు

రాజాం: పట్టణంలో వాసవీనగర్, రాణావీధి, ఈశ్వరనారాయణకాలనీ ప్రాంతాల్లో ఆదివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పబ్లిక్ హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు మురుగుకాలువల్లో పూడికలను తొలగించారు. అనంతరం ట్రాక్టర్ ద్వారా వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం ఎంతో మంచిదని స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి విద్యార్థీ పాఠ్య పుస్తకాలతో పాటు ఇతిహాసాలు, కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవాలని సూచించారు. విద్యార్థులంతా లైబ్రరీలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ వర్షిణి

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామంలో ఎస్సీ వీధిలో రూ.12 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించారన్నారు. ఇందులో భాగంగా సీసీరోడ్లు, తాగునీటి కుళాయిల ఏర్పాటు, పేదలకు ఇళ్లు తదితర పథకాలతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క శ్రీను, నక్క ఉమామహేశ్వరరావు, నక్క ప్రసాద్, లక్ష్మణ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేరాళ్ల ఏర్పాటు వేగవంతం

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీసర్వేలో ఇంతవరకు జరిగిన సరిహద్దులు గుర్తించిన ప్రతిచోటా రాళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగవలస, కొరటాం, కూనాయవలస, తదితర గ్రామాల్లో సర్వేరాళ్లు వేయడాన్ని మండల సర్వేయర్ వెంకటరమణతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, భూముల రీసర్వే, సరిహద్దుల గుర్తింపు, పూర్తయిన పొలాల గట్లపై సర్వేరాళ్లు సంబంధిత రైతుల సమక్షంలోనే వేయాలని సూచించారు. భూముల రీసర్వే ద్వారా భవిష్యత్‌లో రైతుల మధ్య సరిహద్దుల సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని తెలిపారు. మండలంలోని మూడు గ్రామ సచివాలయాల పరిధిలో సర్వేరాళ్లు వేసే కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని తహసీల్దార్ రాజేశ్వరరావు తెలిపారు.



వెలగవలసలో సర్వేరాళ్లు వేయడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు, మండల సర్వేయర్ వెంకటరమణ

ఠారెత్తిస్తున్న సూరీడు

● ఎండ వేడిమితో జనం బెంబేలు



ఎండ తీవ్రతకు గొడుగు వేసుకుని వస్తున్న మహిళలు



నిర్మానుష్యంగా మారిన మండల కేంద్రం



బొబ్బిలి: నిర్మానుష్యంగా మారిన ఫ్లైఓవర్ జంక్షన్

రామభద్రపురం: రోజురోజుకూ ఎండలు మండుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజులుగా 41 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజల భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండ ధాటికి ఆదివారం ఉదయం పది గంటలకే స్థానిక జాతీయ రహదారి నిర్మానుష్యంగా మారింది. అంతర్రాష్ట్ర కూడలి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. అటువంటి ముఖ్య కూడలి కూడా బోసిపోవడంతో కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు గొడుగులు, టోపీలతో వస్తున్నారు. కొనుగోలుదారులు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి.

బొబ్బిలిలో..

నాలుగు రోజులుగా ఎండలు మండుతున్నాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలెవ్వరూ బయటకు రావడానికి సాహసించడం లేదు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బొబ్బిలిలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ముస్లింల అభివృద్ధి

● ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీ వర్గాలను ఆదుకునేది వైఎస్సార్‌సీపీయేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణానికి చెందిన ముస్లిం మత పెద్దలు ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, జామియా మసీదు అధ్యక్షుడు హాజీ పీరా, మదరసా స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ కలాం, సాధిక్, నాగూర్ జానీ, రజాక్, అజ్గర్ అలీ, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

మిషన్ వాత్సల్యకు 1168 దరఖాస్తులు

రాజాం: రాజాం ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలో మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి ఆదివారం నాటికి 1168 దరఖాస్తులు వచ్చాయని సీడీపీఓ డాక్టర్ టి.కనకదుర్గ తెలిపారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. దరఖాస్తు చేయదలచిన వారు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

సంతకవిటి: మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీఓ త్రినాథరావు ఆదివారం వెల్లడించారు. వారం రోజుల క్రితం మండలంలో అన్ని పంచాయతీల్లో ఉపాధితో పాటు అనుబంధ శాఖల ద్వారా 2021–22 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ఉపాధిపనులపై సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ రవికుమార్‌తో పాటు డీఆర్‌పీలు తనిఖీలు నిర్వహించారు. పంచాయతీల వారీగా గుర్తించిన అంశాలను, ఆడిట్ నివేదికను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో శివం మందిర సత్యసాయి భక్తులు మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. మానవసేవే మాధవసేవగా స్వామివారి సూక్తులు అనుసరిస్తూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఆదివారం సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో వేసవి పూర్తయ్యేంత వరకు చలివేంద్రం ఉంటుందన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

పశుగ్రాసం పెంపకంపై రైతుల ఆసక్తి



వావిలవలసలో పశుగ్రాసం సాగు

రేగిడి: మండలంలో పలుగ్రామాలకు చెందిన రైతులు పశుగ్రాసం పెంచేందుకు ఆసక్తిచూపుతున్నారు. పాడిపశువులకు పశుగ్రాసం కొరత లేకుండా చూసేందుకు పశుగ్రాసాన్ని సాగు చేస్తున్నామని రైతులు అంటున్నారు. మండలంలోని వావిలవలస, అంబఖండి, సంకిలి, ఉంగరాడ తదితర గ్రామాల్లో పశుగ్రాసం అధికంగా సాగు చేస్తున్నారు. పశుసంవర్ధకశాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందించడంతో పాటు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుండడంతో పశుగ్రాసం సాగుకు రైతులు ముందుకొస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

బొండపల్లి: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకుడు (డీపీఎం) ఎస్.ఆనందరావు అన్నారు. మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 365 రోజులూ ఏదో ఒక పంటను సాగు చేయడం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో కొన్ని గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ మెర్సీ,మండల యాంకర్ ఎస్.రామకృష్ణ, ఐసీఆర్‌పీ ఎం.కిషోర్, ఎం.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న డీపీఎం ఆనందరావు

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక ఎన్‌పీఆర్ భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన ప్రజా నాట్యమండలి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా కంటక విధానాలను అవలంభిస్తూ, ప్రజా సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేసి ప్రజలపై భారం మోపుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంచెలంచెలుగా ప్రైవేటు పరం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ఎనిమిదేళ్ల పాలనలో కార్పొరేట్ శక్తులు ఆర్థికంగా లాభపడ్డాయన్నారు. ప్రజా కళలైన ఆటపాటల ద్వారా ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకుడు రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాము, ఐద్వా నాయకురాలు పి. రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్